నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, సోమవారం 4 నవంబర్ 2024 | RAJANNA SIRCILLA

ఇదేం నిర్లక్ష్యం..

కురిక్యాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

- ధాన్యం తెచ్చి 15 రోజులైనా కొనరా..? • మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ • కురిక్యాలలో కొనుగోలు కేంద్రం పరిశీలన

గంగాధర, నవంబర్ 3: 'రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి 15 రోజులైనా కొనుగోలు చేయరా..? ఇదేం నిర్లక్ష్యం..?' అంటూ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగాధర మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 15 రోజులైందని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వచ్చి కొబ్బరికాయ కొట్టి పోయినంక ఇటు వైపు చూసినవారే లేరని మండిపడ్డారు. ఆదివారం కురిక్యాల సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో దళారులు లారీలను పెట్టి ధాన్యం కొనుగోలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు సాగి మహిపాల్‌రావు, ఆకుల మధుసూదన్, వేముల దామోదర్, మడ్డపెల్లి గంగాధర్, వేముల అంజి, రామిడి సురేందర్, సుంకె అనిల్, లింగాల దుర్గయ్య, గడ్డం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర మండలం కురిక్యాలలో దళారులు కొనుగోలు చేసిన ధాన్యం లారీలో

కురిక్యాలలో దళారుల హవా..

ఇది గంగాధర మండలం కురిక్యాలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన ధాన్యం కొనుగోలు కేంద్రం. గతంలో రైతులు ఇక్కడి కేంద్రంలో సకాలంలో ధాన్యం విక్రయించుకుని ధీమాగా ఉండేవారు. డబ్బులు కూడా సకాలంలో బ్యాంకు ఖాతాల్లో పడేవి. కానీ, ఈసారి ఈ గ్రామ రైతులు తమ ధాన్యం విక్రయించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. గత నెల 16న ప్యాక్స్ ఆధ్వర్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచే రైతులు ధాన్యం తెచ్చి కుప్పలుగా పోసుకున్నారు. కానీ, ఇప్పటి వరకు ఒక్క ధాన్యపు గింజనూ కూడా కొనలేదు. ఇక్కడి రైతుల పరిస్థితిని చూసి దళారులు రంగ ప్రవేశం చేశారు. రూ.1,850 క్వింటాల్ చొప్పున కొంటామని ముందుకు వచ్చారు. ప్రభుత్వం కొనకపోవడంతో తీవ్రంగా విసిగి పోయిన రైతులు, విధి లేని పరిస్థితుల్లో దళారులకు తెగనమ్ముకుంటున్నారు. ఇప్పటికే ఈ కేంద్రానికి 6 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం రాగా, ఇప్పటివరకు 4 వేల క్వింటాళ్లు అమ్ముకున్నారు. దళారులు యథేచ్ఛగా ఈ కేంద్రంలోనే తూకం వేసుకుని సుమారు 20 లారీల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కురిక్యాలలో ధాన్యం ఎత్తుతున్న దళారులకు చెందిన హమాలీలు

కొనుగోలు కేంద్రాల్లో దళారుల రాజ్యం

- సెంటర్లను ఆక్రమించి మరీ కొనుగోళ్లు • క్వింటాలుకు రూ.1,800 మాత్రమే
- ప్రభుత్వ జాప్యంతో నిండా మునుగుతున్న అన్నదాతలు • ఆగ్రహంతో రోడ్డెక్కి నిరసనలు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దళారులు రాజ్యమేలుతున్నారు. సర్కారు నిర్లక్ష్యం.. ధాన్యం సేకరణలో అలసత్వాన్ని అవకాశంగా మలుచుకొని రెచ్చిపోతున్నారు. సెంటర్లను ఆక్రమించి ధాన్యాన్ని తక్కువ ధరకే (క్వింటాల్‌కు రూ.1800) కొంటూ మిల్లర్లకు అమ్మేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే వేలాది క్వింటాళ్ల ధాన్యం మధ్య వర్తుల పాలుకాగా, కొనుగోళ్లలో ప్రభుత్వం చేస్తున్న జాప్యంతో విధిలేని పరిస్థితుల్లో రైతులూ అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కొత్తగా విధించిన నిబంధనతో మిల్లర్లు కొనుగోళ్లకు ముందుకు రాకపోవడమే కారణంగా కనిపిస్తుండగా, జరుగుతున్న నష్టాన్ని చూసి రైతాంగం ఆవేదన చెందుతున్నది. కడుపు మండి ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగుతున్నది.

కరీంనగర్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ)/ ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ ఉమ్మడి జిల్లా రైతులు తమ ధాన్యం విక్రయించుకునేందుకు మునుపెన్నడూ లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వానకాలం సీజన్‌లో ఇప్పటికీ పూర్తి స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడగా, దీనిని ఆసరా చేసుకుంటున్న దళారులు ఏకంగా ప్రభుత్వం గుర్తించిన కొనుగోలు కేంద్రాల్లోనే అడ్డా వేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.1,800 నుంచి రూ.1,850 చెల్లించి కొనుగోలు చేస్తూ, మిల్లర్లకు విక్రయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అనేక కేంద్రాల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. నిజానికి ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాలు ఏ గ్రేడు ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ప్రకటించింది. దళారులు చెల్లించే ధరకు కనీస మద్దతు ధరకు ఒక్క క్వింటాలుపై రూ.500 వ్యత్యాసం కనిపిస్తోంది. అంటే ఒక్క 20 క్వింటాళ్ల దళారులకు విక్రయించిన రైతు రూ.10 వేలు నష్టపోవాల్సి వస్తోంది.

కుప్పలు తెప్పలుగా ధాన్యం..

గత నెల 14 నుంచి ఎమ్మెల్యేలు, అధికారులు అట్టహాసంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. దాదాపు అన్ని చోట్లా ప్రారంభించిన అధికారులు, ఇప్పటి వరకు కొనుగోళ్లు మాత్రం మొదలు పెట్టలేదు. గత నెల మొదటి వారంలోనే కోతలు నిర్వహించుకున్న రైతులు, కేంద్రాల్లోనే ఆరబెట్టుకుంటూ విసిగి పోతున్నారు. ఇప్పటికే కొనుగోళ్లు జరిగితే ముందుగా కేంద్రాలకు వచ్చిన రైతుల చేతికి డబ్బులు వచ్చేవి. అయితే, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితిని చూసిన దళారులు రంగ ప్రవేశం చేసి ఎక్కడ బడితే అక్కడ విచ్చల విడిగా ప్రభుత్వం ద్వారా ఐకేపీ, ప్యాక్స్, హాకా, డీసీఎంఎస్ కేంద్రాలను అడ్డాలుగా మార్చుకుని యథేచ్ఛగా కొనుగోళ్లు జరుపుతున్నారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు జరుపుతున్నా జిల్లా అధికార యంత్రాంగాలు చేష్టలుడికి చూస్తున్నాయి.

ఈ పరిస్థితికి బాధ్యులెవరు..?

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎంత సేపూ ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉందని, ఇంకా ఆరబెట్టిన తర్వాత కొనుగోళ్లు జరుపుతామని ఆయా జిల్లాల అధికారులు చెబుతున్నారు. కానీ, వాస్తవం మరోలా కనిపిస్తోంది. నిర్ణయం తీసుకోవడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. అంతే కాకుండా మిల్లర్లతో ప్రభుత్వం తగువు పెట్టుకోవడం వల్ల కొనుగోళ్లకు వారు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో ఇప్పటి వరకు మిల్లర్లతో జిల్లాల వారీగా అగ్రిమెంట్లు కూడా జరుగనట్లు సమాచారం. ఒక్కో ఏరియాలో కొన్ని మిల్లులను ప్రభుత్వం అలాట్ చేసే ప్రక్రియ ఇప్పటి వరకు పూర్తి కాకపోవడంతో ధాన్యం కొనుగోలు చేసి ఎక్కడ నిలువ చేసేదని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అయితే, శనివారం నుంచి కరీంనగర్ జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. మిల్లులు అలాట్ కానప్పటికీ ఆయా ఏజెన్సీల వరకే ఈ ధాన్యం కొనుగోళ్లు జరిగినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

రోడ్డెక్కుతున్న అన్నదాతలు

ధాన్యం కొనుగోళ్లు సకాలంలో జరగకపోవడంతో ఉమ్మడి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు తక్షణమే జరపాలని రైతులు రోడ్డెక్కుతున్నారు. పలు ప్రతిపక్ష పార్టీలు కూడా రైతులకు మద్దతుగా నిలుస్తున్నాయి. ముందు నుంచే రైతన్నలకు అండగా ఉన్న ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

కొనుగోళ్లు షురూ

నమస్తే ఎఫెక్ట్

- ముస్తాబాద్ మండలంలో ధాన్యం సేకరణ ప్రారంభం • దళారులకు అమ్ముొద్దు
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- నామాపూర్, చీకోడు, చిప్పలపల్లి కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

నామాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సేకరణ (తూకం) చేయాలని నిర్వాహకులను ఆదేశిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్, నవంబర్ 3: ముస్తాబాద్ మండలంలో కొనుగోళ్లు మొదలయ్యాయి. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రోజులు గడుస్తున్నా ధాన్యం కొనడం లేదని పేర్కొంటూ 'నమస్తే తెలంగాణ'లో ఇటీవల వరుస కథనాలు ప్రచురితం కాగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా అధికారులు స్పందించారు. ఆదివారం నామాపూర్, చీకోడు, చిప్పలపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్వాహకులను ఆదేశించి, తూకం వేయించారు. మండల వ్యాప్తంగా ధాన్యం సేకరణ ప్రారంభించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీసీవో రామకృష్ణ, తహసీల్దార్ సురేశ్, ముస్తాబాద్ సహకార సంఘం చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి కేంద్రాల సిబ్బంది ఉన్నారు.

అడ్డికి పావుశేరు లెక్క అమ్ముకుంటున్నం..

కురిక్యాలలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించి 20 రోజులైతది. ఎమ్మెల్యే సారు కొబ్బరికాయ కొట్టి పొయ్యినంక మళ్ల ఎవ్వలు ఇటువైపు రాలేదు. కొనేటోళ్లు లేరు. గన్నీ సంచులి చ్చేటోళ్లు లేరు. రాత్రి పూట కుక్కలు వడ్లను చిందరవందర చేస్తున్నయి. సర్కారు వడ్లు కొనేతట్టులేదు. చేసేదేం లేక వడ్డీకి పావుశేరు లెక్క దళారులకు అమ్ముకుంటున్నం.

- మడుపు గోపాల్‌రెడ్డి, రైతు, కురిక్యాల

వడ్లు తడిసి మొలకత్తున్నయి..

కురిక్యాల వడ్ల కేంద్రంలో ధాన్యం ఎవ్వలు కొంటరో తెలుస్తలేదు. ఎప్పుడు కొంటరో చెప్పెటోళ్లు లేరు. వడ్ల కాడికి అచ్చి చూసినోళ్లు లేరు. ఇప్పటి వరకు కేంద్రంలో కాంట వెయ్య లేదు. వడ్లు కొనలేదు. రెండు సార్లు వడ్లు తడిసి మొలకలత్తున్నయి. ఇట్లను ఉంటే పరిస్థితి చేయిదాటి పోతది. ఏం చేయాలో అర్థంకాక సేటును బతిలాడి వడ్లు అమ్మిన. ఇసోంటి పరిస్థితి ఎప్పుడు రాలేదు.

- అబ్బడి చంద్రారెడ్డి, రైతుల, కురిక్యాల

కేసీఆర్ సారు ఉన్నప్పుడే మంచిగుండె..

కేసీఆర్ సారు ఉన్నప్పుడే మంచి గుండె. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు అచ్చినంక ఏం మంచిగ అనిపిస్త లేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు కేంద్రంలో వడ్లు జెప్పన కొని తీసుకపోతుండేది. ఇప్పుడు 20 రోజుల సంది పడిగాపులు పడుడైతంది. వానలకు వడ్లు కాపాడుకునుడు కష్టమైతంది. జెప్పన వడ్లు కొని రైతులను ఆదుకోవాలే.

- కెంచ సూరవ్వ, మహిళా రైతు, కురిక్యాల

రైతన్న కన్నెర్ర.. పదిరలో రాస్తారోకో

పదిరలో రోడ్డుపై ధాన్యం పోసి నిరసన తెలుపుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 3: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతులు మండిపడుతున్నారు. కేంద్రాల్లో ధాన్యం పోసి 20రోజులైనా కాంటా వేయక పోవడంతో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్‌కు చెందిన రైతన్నలు ఆందోళనకు దిగారు. కామారెడ్డి– సిరిసిల్ల ప్రధాన రహదారిపై గంటసేపు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ సీజన్‌లో సుమారు 1350 ఎకరాల్లో పదివేల క్వింటాళ్ల ధాన్యం పండించామన్నారు. 20 రోజుల కిందే పంట కోసి కొనుగోలు కేంద్రాలను తెస్తే, ఇప్పటివరకు ఇటు వైపు చూసినోళ్లే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వచ్చి శాంతింపజేసినా రైతులు ససేమిరా అన్నారు. అనంతరం డీఏస్‌వో వసంత కుమారి ఈ రోజే ధాన్యం సేకరణ మొదలు పెడతామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అనంతరం అధికారులు, డీఎస్‌వో వచ్చి పదిరలో కొనుగోళ్లు ప్రారంభించారు. కొన్న ధాన్యాన్ని రైసు మిల్లర్లు తీసుకోకపోవడంతో అప్పారెల్ పార్కులోని షెడ్లకు తరలించారు. ఆందోళనలో మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, నాయకులు కుంబాల లక్ష్మారెడ్డి, కంచర్ల పర్శరాములు, పొన్నాల తిరుపతిరెడ్డి, సల్ల సత్యంరెడ్డి, బోల్లు కొమురయ్య, రైతులు ఉన్నారు.

ఆరు గంటల గానామృతం

- ఐదు రికార్డుల నమోదు
- 72 పాటలతో అలరించిన గాయని సంధ్య

పాట పాడుతున్న సంధ్య

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, నవంబర్ 3 : కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గాయని సల్వాజి సంధ్య స్థానిక కలెక్టర్ ఆడిటోరియంలో ఆరు గంటల పాటు నిర్విరామంగా 72 పాటలు పాడి ఐదు రికార్డులు సొంతం చేసుకుంది. ఆదివారం ఉదయం సల్వాజి ప్రవీణ్ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రపంచ రికార్డు కోసం ప్రముఖ గాయని కేఎస్ చిత్ర పాడిన పాటలు పాడింది. అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో కే మహేశ్వర్, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ ప్రెసిడెంట్ పొన్నం రవిచంద్ర, వరల్డ్ రికార్డ్ కోఆర్డినేటర్ కేవీ రమణారావు నేతృత్వంలో ఎనిమిది మంది వాయిద్య కళాకారుల సహకారంతో 72 పాటలు పాడింది. సాయంత్రం భారత్ వరల్డ్ రికార్డ్, సింగర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్, కల్చరల్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ప్రదర్శన రికార్డ్‌గా నమోదు చేసి, ఆమెను అభినందించారు. ఇక్కడ కేఎస్ అనంతాచారి, జీ కృపాదానం, వీ గోపాల్‌రావు, సల్వాజి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సామాజిక చైతన్యం

- పురస్కారాలతో రచయితల బాధ్యత పెరుగుతుంది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ముక్తేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహిత్య పురస్కారాల ప్రదానం

సాహితీవేత్తలను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబర్ 3: సామాజిక చైతన్యానికి సాహిత్యం ఎంతగానో ఉపకరిస్తుందని, రచయితల బాధ్యతలను పెంచేది సాహిత్య పురస్కారాలు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కథా సంపుటి, వ్యాస సంపుటి, ఆధ్యాత్మిక గ్రంథాల పోటీల్లో విజేతలకు వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో జవహర్‌లాల్ నెహ్రూ బీఈడీ కాలేజీలో ఆదివారం పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ఆది శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. వేములవాడ ప్రాంతానికి చెందిన సినారె సహా న్యాయమూర్తి జింబో (మంగారి రాజేందర్), తదితరులు తెలుగు సాహిత్యంలో ఉద్దండులుగా ఎదిగారని గుర్తు చేశారు. వేములవాడలో జేఎన్ఎంఎస్ విద్యాసంస్థల అధినేత, ప్రముఖ విద్యావేత్త ఈశ్వరగారి నరహరిశర్మ అతని సతీమణి ముక్తేశ్వరి స్మారకంగా సాహిత్య పురస్కారాలను ప్రదానం చేయడం వారి గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ సందర్భంగా వేములవాడ అనువంశిక రచయిత చొప్పకట్ల భానుశర్మ రచించిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర శత బిల్వార్చన గ్రంథాన్ని ఈశ్వరగారి నరహరిశర్మ, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ గిరిజ మనోహర్‌బాబు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ సాహిత్యం సామాజిక విలువలను ఉన్నతీకరించేందుకు, కొంగొత్త ఆవిష్కరణలకు దోహదం చేస్తుందన్నారు. తెలంగాణ తొలి బీసీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన బీఎస్ రాములు మాట్లాడుతూ సాహిత్యంలో ఉన్నత విలువలను పెంచడానికి ఈ పురస్కారాలు రుజువు చేస్తున్నాయని తెలిపారు. కథాసంపుటి న్యాయనిర్ణేతగా వ్యవహరించిన న్యాయమూర్తి, మంగారి రాజేందర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కథ సాహిత్యం గొప్ప విస్తృతిని కలిగి ఉన్నదన్నారు. అనంతరం 77 వసంతాలు పూర్తిచేసుకున్న నరహరిశర్మను పలువురు ప్రముఖులు సత్కరించారు. కాగా, వచ్చే సంవత్సరం నుంచి కవితా సంపుటి విభాగంలో ఎంపికైన రచనకు కూడా తన సతీమణి ముక్తేశ్వరి పేరిట సాహితీ పురస్కారం అందిస్తామని నరహరిశర్మ ప్రకటించారు. అనంతరం రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కొమురవెల్లి రాజేందర్, ప్రముఖ రచయిత, చరిత్రకారులు సంకేపల్లి నాగేంద్రశర్మ, సీనియర్ జర్నలిస్ట్ పీఎస్ రవీంద్ర తదితరులను నిర్వాహకులు సత్కరించారు. అలాగే సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, ప్రముఖ రచయితలు డాక్టర్ నమిలికొండ సునీత, నాయిని సుజనాదేవి, డా.అమరవాది నీరజ, ముని సురేశ్ పిల్లై, గర్రెపల్లి అశోక్, డాక్టర్ సబ్బని లక్ష్మీనారాయణ, వేణుశ్రీ, డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, యోగాచార్య, సంపత్‌కుమార్, ఆడెపు లక్ష్మీపతి, దూరదర్శన్ రిటైర్డ్ అధికారి కృష్ణారావు, గోసంరక్షకులు, సినీ దర్శకులు నిట్టల గోపాలకృష్ణ, తెలంగాణ పత్రిక పూర్వ సంపాదకులు అష్టకాల రామ్మోహన్‌శర్మ ,ప్రముఖ వ్యాఖ్యాత మడుపు దక్షిణామూర్తి, ఆకాశవాణి ఆర్టిస్ట్ సమ్మెట నాగ మల్లేశ్వరరావును నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వేములవాడ దేవస్థానం మాజీ చైర్మన్ ఉచ్చిడి మోహన్‌రెడ్డి, జవహర్ లాల్ విద్యాసంస్థల నిర్వాహకులు ఈశ్వరగారి రమణ, శుభ చరణ్, జీఎస్ మోహన్, నమిలికొండ జయంత్, చొప్పకట్ల వేణు, గర్శ గుర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాల భర్తీ

- ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గుట్టుగా లాబ్‌టెక్నీషియన్ల రిక్రూట్‌మెంట్
- ఆలస్యంగా వెలుగులోకి..

కరీంనగర్ విద్యానగర్, నవంబర్ 3 : ప్రభుత్వ శాఖల్లో ఏ ఉద్యోగం భర్తీ చేయాలన్నా నోటిఫికేషన్ తప్పనిసరి. కానీ, కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మాత్రం ఈ నిబంధన వర్తించనట్టున్నది. రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను గుట్టుగా భర్తీ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది.

భర్తీలో దాపకరికం దేనికి?

ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిధిలోని ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లో రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల్లో పనిచేస్తున్న ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఒకరు చనిపోగా, మరొకరు మానేశారు. దీంతో ఈ పోస్టుల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరిని ఎవరికీ తెలియకుండా భర్తీ చేశారు. 2024 సెప్టెంబర్ 18న ఆర్సీ నంబర్ 477 పేరిట కళాశాల ప్రిన్సిపాల్ ఉత్తర్వులు జారీశారు. కానీ, ఈ విషయం తనకు తెలియదని, పరిశీలించి చెబుతానని ప్రిన్సిపాల్ చెబుతున్నారు. అయితే, గత సెప్టెంబర్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా భర్తీ అయిన ఈ ఇద్దరు ఉద్యోగులు ఇప్పటి వరకు ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లో కాకుండా స్థానిక ప్రభుత్వ జనరల్ దవాఖానలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. గుట్టుగా రిక్రూట్ అయిన ఈ ఉద్యోగులు నిజానికి ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లోనే పనిచేయాలి. కానీ, అక్కడ విధులు నిర్వహిస్తే అందరికీ తెలిసి పోతుందనే ఉద్దేశంతో కొంత కాలం జనరల్ దవాఖానలోని ల్యాబ్‌లో పని చేయాలని వీరిని అక్రమంగా రిక్రూట్ చేసిన అధికారులు సూచించినట్లు తెలుస్తోంది.

అర్హుల్లో ఆందోళన

గుట్టుగా జరిగిన రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ విషయంలో అర్హులైన కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన వారికి ఈ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. అంతే కాకుండా నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేయాలి. కానీ, ఇందుకు విరుద్ధంగా జరిగిన ఈ రెండు పోస్టుల విషయంలో అర్హులైన కొందరు అభ్యర్థులు ఇప్పటికే కలెక్టర్‌తో సహా పలువురు వైద్యాధికారులు, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నట్లు తెలిసింది. అయితే, వారధిలో దరఖాస్తు చేసుకున్న వారిని పిలిచి భర్తీ చేశామని, అధికారులు తమ చర్చను సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారధిలో తాము కొన్నేండ్ల కిందనే దరఖాస్తు చేసుకుని ఉన్నామని, తమకు కాకుండా కొత్త వారికి అవకాశం ఎలా వచ్చిందని పలువురు అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.



ల్యాబ్ టెక్నీషియన్ల నియామక ఉత్తర్వులు

ప్రిన్సిపాల్‌కు తెలియదట!

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ కవితను ఈ విషయమై వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, తాను సెలవుల్లో ఉన్నానని స్పష్టం చేశారు. నిజానికి ప్రిన్సిపాల్ పేరిటనే నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పేరు సంతకంతో ఈ నియామక పత్రం జారీ అయ్యింది. అసలు ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకం ప్రిన్సిపాల్‌కు తెలిసే జరిగిందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పడిన అనతి కాలంలోనే ఇలాంటి ఆరోపణలు జరగడం చర్చనీయాంశంగా మారింది. కొందరు అధికారులు నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఎవరికీ తెలియకుండా నియామకాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దల లేఖలు సిఫారసుగా మాపి కొందరు అధికారులు పెద్ద మొత్తంలో నియామకాల దందాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా మెడికల్ కళాశాలతో పాటు, జనరల్ దవాఖానలో కొత్తగా జరుగుతున్న ప్రతి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాల విషయంలో విచారణ జరిపితే అనేక అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

మ్యాట్రిమోని పేరుతో సైబర్‌క్రైమ్

- ఫేక్ ప్రొఫైల్స్ పెట్టి మోసాలు • దంపతుల రిమాండ్

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 3: మ్యాట్రిమోనీ డాట్‌కామ్‌తో సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా అశోక్‌నగర్‌కు చెందిన దంపతులు ఎర్ర వెంకటనాగరాజు, రామంచ సౌజన్యను రిమాండ్ చేసినట్లు రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్టేషన్ ఎస్‌హెచ్‌వో డీఎస్పీ ఎం వెంకటరమణ ఆదివారం వెల్లడించారు. గత నెల 5న మంచిర్యాల జిల్లాకు చెందిన ఒక వ్యక్తి సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కుకొని రూ.17 లక్షలు మోసపోయి సైబర్‌క్రైమ్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ జే కృష్ణమూర్తి కేసు నమోదు చేసుకుని పరిశోధన ప్రారంభించగా భార్యాభర్తల సైబర్‌క్రైమ్ బయటపడిందన్నారు. వీరిద్దరూ మ్యాట్రిమోనీ డాట్‌కామ్ అనే వెబ్‌సైట్లో వారి సెల్‌నెంబర్లు పెట్టి ఫేక్ ప్రొఫైల్ క్రియేట్ చేసి అందమైన అమ్మాయిల ఫొటోలు అప్లోడ్ చేస్తూ అబ్బాయిలకు రిక్వెస్ట్ పెట్టారని తెలిపారు. స్పందించిన వారితో డబ్బుల వసూలు కోసం అమ్మకు ఆరోగ్యం బాగాలేదని మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేసినట